# సాక్షి మంచిర్యాల

గురువారం । 17 । అక్టోబర్ । 2024






## పోరు పల్లెలు.. తీరని వెతలు

ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన పల్లెలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయి. రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ప్రభుత్వాలు మారినా వసతులు మెరుగవడం లేదు. 8లో▸

## వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

కోటపల్లి: ఇంటర్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని డీఐఈవో అంజయ్య అన్నారు. బుధవారం కోటపల్లి మోడల్ స్కూల్‌ను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి విద్యార్థుల హాజరుశాతం పెంచాలని ఆదేశించారు. అనంతరం డీఐఈవో అంజయ్య మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులు, కళాశాలకు మంచిపేరు తీసుకరావాలని సూచించారు. అనంతరం ఇటీవల ఐఐటీకి ఎంపికైన హన్సికకు నగదు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం
34.0 /26.0

## వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఆగ్నేయం దిశగా గాలులు వీస్తాయి.

## న్యూస్‌రీల్

### కొలువుల్లో చేరిన కొత్త ఉపాధ్యాయులు



మంచిర్యాలలో డీఈవో ఎస్ మాలవిదేవికి రిపోర్టింగ్ చేస్తున్న కొత్త టీచర్లు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో కొత్త ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో కొలువుల్లో చేరారు. మంగళవారం పాఠశాలల కేటాయింపు నియామక పత్రాలు అందుకున్న ఉపాధ్యాయులు డీఈవోలకు రిపోర్టింగ్ చేశారు. ఇదివరకు ఆయా పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులు బదిలీ పాఠశాలలకు వెళ్లారు. తొలి పోస్టింగ్ చేపట్టిన కొత్త టీచర్లు పాఠశాలలకు వెళ్లి బోధన ప్రారంభించారు. 230 ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ ద్వారా పాఠశాలల కేటాయింపు చేశారు. మంచిర్యాల మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో తెలుగు, ఉర్దూ మీడియం కలిపి 10 మంది ఉపాధ్యాయులకు గాను 9 మంది విధుల్లో చేరారు. పాఠశాలల్లో చేరేందుకు 15 రోజుల వరకు గడువు ఉండడంతో 80శాతం మంది టీచర్లు విధుల్లో చేరినట్లు తెలుస్తోంది.

### రసవత్తరంగా పోలీస్ స్పోర్ట్స్ మీట్



వాలీబాల్ ఆడుతున్న పోలీస్ అధికారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో స్పోర్ట్స్ మీట్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. రెండో రోజు బుధవారం క్రికెట్, పరుగు పందెం, టగ్ ఆఫ్ వార్, లాంగ్ జంప్, హై జంప్, వాలీబాల్ తదితర పోటీలు సాగాయి. కమాండెంట్ వెంకటరాములు పోలీస్ క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక వికాసానికి దోహదం చేస్తాయని అన్నారు. 18వరకు జరిగే ఈ పోటీల్లో ప్రతి ఒక్కరూ క్రీడాస్ఫూర్తి చాటాలని తెలిపారు. పోటీలను బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ నాగేశ్వర్‌రావు, కాళిదాసు, ఆర్ఐలు, ఏఆర్ఎస్సైలు పర్యవేక్షించారు.

### అట్టహాసంగా కళోత్సవం ప్రారంభం



డోలు వాయిస్తున్న విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసి ప్రోత్సహించేందుకు సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహించే కళోత్సవం పోటీలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. జిల్లా సైన్స్‌కేంద్రంలో రెండు రోజులపాటు జరిగే జిల్లా స్థాయి పోటీలకు జిల్లాలోని అన్ని పాఠశాలల యాజమాన్య పరిధిలోని పాఠశాలల నుంచి 120 విద్యార్థులకు హాజరయ్యారు. గాత్రం, వాయిద్య సంగీతం, నృత్య పోటీలు అలరించాయి. ఈ సందర్భంగా జిల్లా ఇంక్లూసివ్ ఎడ్యుకేషన్ కో–ఆర్డినేటర్ చౌదరి మాట్లాడుతూ విద్యార్థుల్లో కళా నైపుణ్యాలను వెలికితీసే వేదిక కళోత్సవ్ అన్నారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా ఆర్కే ప్రసాద్, సంతోష్‌కుమార్, నారాయణరావు, శాంకరి, కరుణాకర్, అర్జున్, లక్ష్మణ్ వ్యవహరించారు. పోటీల సమన్వయ కర్త సత్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీఎస్‌వో మధుబాబు, సెక్టోరల్ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

### శాలివాహన పవర్ ప్లాంటు తెరిపించాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని రంగపేట శివారులో ఉన్న శాలివాహన బయోమాస్ పవర్ ప్లాంటు తెరిపించాలని శాలివాహన పవర్‌ప్లాంట్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. బుధవారం పవర్ ప్లాంట్ ఎదుట సమావేశం అయ్యారు. పవర్ ప్లాంట్‌కు పవర్ పర్చేజ్ అగ్రిమెంట్(పీపీఏ) లేదని 20 నెలలుగా మూతబడి ఉందని పేర్కొన్నారు. ప్లాంట్‌కు పీపీఏ తెప్పించి ఉత్పత్తి జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఎలాంటి పెట్టుబడులు లేకుండా ఉత్పత్తితోపాటు 300 మంది కార్మికులకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. పవర్‌ప్లాంట్ కార్మిక సంఘం అధ్యక్షుడు కుంటాల శంకర్, మాజీ అధ్యక్షుడు చెట్టి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కాయితి శ్రీనివాస్, పెంట సత్యం, కార్మికులు ఊడెం రవి శంకర్, ఆసరి రాజయ్య, ఎస్.తిరుపతి, శ్రీశైలం, తిరుపతి, పోషం పాల్గొన్నారు.

# ఆగడాలకు అడ్డేది?

- జిల్లా కేంద్రంలో తరచూ గ్యాంగ్‌వార్‌లు
- రాజకీయ అండతో రెచ్చిపోతున్న యువకులు
- నాయకుల స్వార్థంలో పావుగా యువత
- కట్టడి చేయకపోతే మరిన్ని అనర్థాలు



బతుకమ్మ పండుగ రోజు మంచిర్యాలలో జరిగిన ఘర్షణ దృశ్యం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లా కేంద్రంలో వర్గ కొట్లాటలు పెరిగిపోతున్నాయి. గతంలో ఎన్నడూ లేనంతగా ఇటీవల వరుసగా పలు ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. కొందరు యువత ఓ గ్యాంగ్‌గా ఏర్పడి పట్టణంలో భయభ్రాంతులకు గురి చేస్తూ శాంతిభద్రతల సమస్యలు సృష్టిస్తున్నారు. వర్గాల పగతో ప్రశాంత వాతావరణంలో అశాంతికి కారణం అవుతున్నారు. మరోవైపు శాంతిభద్రతల నిర్వహణలో నిరంతరం గస్తీ కాసే పోలీసు వ్యవస్థ ఉన్నా అరికట్టలేకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. ఓ వర్గంవైపు మద్దతు ఇచ్చేలా వ్యవహరించడం సైతం పోలీసులు అపకీర్తి మూటగట్టుకోవాల్సి వస్తోంది. అధికార, విపక్ష రాజకీయ నాయకుల అనుచరులు, మద్దతుదారుల గొడవల్లో ఈ తరహా వ్యత్యాసం కనిపిస్తున్నట్లుగా ఆరోపణలున్నాయి. ఇలాంటి ఘటనలను ఆదిలోనే తుంచేయకపోతే సామాన్య ప్రజానీకంతోపాటు అధికార యంత్రాంగానికి ఇబ్బందులు ఏర్పడే అవకాశాలు ఉన్నాయి.

**రాజకీయ అండ**

యువతను నిత్యం మద్యం, గంజాయి, విందు, వినోదాల్లో ముంచుతూ గ్యాంగ్‌ను పెంచి పోషిస్తున్న రాజకీయ నాయకులు ఈ నేరాలకు ప్రధాన కారణంగా మారుతున్నారు. తమ ఎదుగుదల కోసం యువతను పావులుగా మార్చుకుంటున్నారు. భూములు, ఆస్తులు, సమాజంలో తమకు రక్షణకవచంగా వాడుకుంటున్నారు. మధ్య తరగతి కుటుంబాల నుంచి నిరుద్యోగులు, పని లేక ఖాళీగా ఉండే కొందరు యువత గ్యాంగ్ గొడవలతో కేసుల పాలవుతున్నారు. దాడుల కారణంగా కొందరు ప్రాణాపాయ స్థితికి చేరుకుంటున్నారు. వర్గాల కారణంగా ప్రశాంత మంచిర్యాలలో చిచ్చు పెట్టినట్లుగా అవుతోంది. భూ కబ్జాలు, ఆక్రమణలు, తగాదాల సెటిల్మెంట్లు చేస్తూ దాడులకు తెగబడుతున్నారు. వాహనాలతో రాత్రి, పగలు తేడా లేకుండా మారణాయుధాలతో సంచరిస్తున్నారు. ఫలానా గ్యాంగ్ వద్దకు వెళ్తే పని అయిపోతుందనే తీరుగా వ్యవహరిస్తున్నారు. పోలీసులు కేసులు నమోదు చేస్తున్నా ప్రవర్తనలో మార్పు రావడం లేదు.

**దాడులకు తెగబడుతున్నారు**

ఇటీవల జిల్లా కేంద్రంలో జరిగిన వరుస దాడులు ఆందోళన కలిగిస్తున్నాయి. తమ ప్రత్యర్థి వర్గాలకు చెందిన వ్యక్తులను చంపేందుకూ వెనుకాడడం లేదు. గొడవలకు ఏకంగా మరణాయుధాలతో వెళ్తున్నారు. గత కొద్ది రోజులుగా పట్టణంలో గ్యాంగ్‌ల మధ్య గొడవలు జరిగాయి. పోలీసులు కేసులు నమోదు చేశారు. ఐబీ చౌరస్తా, బైపాస్ రోడ్డు, హమాలీవాడ తదితర చోట్లలో జరిగిన తగాదాల్లో అన్నీ కక్ష పూరితంగా జరిగినవే. పట్టణంలో కొన్ని ప్రాంతాలు గ్యాంగ్‌లకు అడ్డాగా మారాయి. ఇవే కాకుండా మంచిర్యాల పట్టణంలో సద్దుల బతుకమ్మ వేడుకల సందర్భంగా, కూడా ఒకే రోజు మూడు చోట్ల గొడవలు జరిగాయి. ఈ ఘటనలో ఎనిమిది మందిని అరెస్టు చేశారు. ఇటీవల గర్మిల్ల శివారులో వెయ్యి గజాల స్థల వివాదంలోనూ కత్తితో ప్రత్యర్థిని బెదిరించారు. ఇక హత్య కేసులు, రౌడీషీట్లు ఉన్న వారితోనే బెదిరించి పనులు చేయించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

**యువత బలి**

జిల్లా కేంద్రంలో గ్యాంగ్‌లను పొంచి పోషిస్తున్న వారిని కట్టడి చేయకపోతే ఎంతో భవిష్యత్ ఉన్న యువత బలి అయ్యే ప్రమాదం ఉంది. సమాజంలో నేర తీవ్రత పెరగడంతో కుటుంబాలు చిన్నాభిన్నమయ్యే ప్రమాదం ఉంది. యువతను పెడదోవ పట్టించి, పావులుగా వాడుకుంటున్న వారిపై పోలీసులు గట్టి నిఘా పెట్టాల్సిన అవసరం ఉంది. రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా అధికార, ప్రతిపక్ష తేడా లేకుండా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉంది. లేకపోతే ప్రజల్లో పోలీసు వ్యవస్థపై నమ్మకం సన్నగిల్లే అవకాశం ఉంది.

### కొత్త సీఐకి సవాళ్లు

మంచిర్యాల పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీపై వస్తున్న ఎస్.ప్రమోద్‌రావు విధుల్లో తాజా పరిస్థితులు ఎదుర్కోవాల్సి ఉంది. జిల్లా కేంద్రంగా ఉన్న మంచిర్యాలలో రాజకీయ నాయకులు, వ్యాపారులు, రియల్టర్లు, ప్రభావితం చేయగల వ్యక్తులు ఉన్నారు. గత కొంతకాలంగా ఇక్కడ నేరాల అదుపు, శాంతిభద్రతల నిర్వహణ కత్తి మీద సాములా మారింది. రాజకీయ, అధికార ఒత్తిళ్లను తట్టుకుంటూ విధులు నిర్వర్తించాల్సి ఉంది. గతంలో ఇక్కడ పని చేసిన ఓ సీఐ ఒత్తిళ్లు తట్టుకోలేక బదిలీ చేయించుకుని మరీ వెళ్లిపోయారు. ఈ క్రమంలో బదిలీపై వచ్చే సీఐ తన సిబ్బందిని అప్రమత్తం చేస్తూ బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంది.

## శిశు మరణాల నియంత్రణపై దృష్టి సారించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో మాతాశిశు మరణాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి హరీష్‌రాజ్, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు రమణ, ఫాక్సీ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ స్వరూపలతో కలిసి ప్రోగ్రాం అధికారులతో మాతాశిశు మరణాల నియంత్రణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు, పిల్లల సంక్షేమానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గర్భిణులు తమ వివరాలు నమోదు చేసుకుని వైద్య పరీక్షలు, మందులు పొందే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అత్యవసర సమయంలో గర్భిణులకు 2డీ ఇకో చేసేందుకు అవసరమైన సాంకేతిక సిబ్బందిని నియమించుకోవాలని, తక్కువ బరువుతో జన్మించిన పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని, పిల్లలకు 100శాతం వ్యాక్సినేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి స్వరూపారాణి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రొఫెసర్ కృష్ణవేణి, డీపీవో ప్రశాంతి, వైద్యాధికారులు పాల్గొన్నారు.

# పోరుగడ్డ ముస్తాబు

- జోడేఘాట్‌లో నేడు కుమురంభీం 84వ వర్ధంతి
- ముఖ్య అతిథిగా హాజరు కానున్న రాష్ట్ర మంత్రి సీతక్క
- ఉదయం 9 గంటలకు సమాధి వద్ద పూజ..
- పోలీసుశాఖ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు
- 15వేల మంది తరలివస్తారని అధికారుల అంచనా..



జోడేఘాట్‌లోని కుమురంభీం స్మారక స్తూపం



ప్రజలు కూర్చునేందుకు వీలుగా ఏర్పాట్లు

కెరమెరి(ఆసిఫాబాద్): గిరిజన పోరాటయోధుడు, ఆదివాసీల ముద్దుబిడ్డ కుమురంభీం 84 వర్ధంతికి కెరమెరి మండలంలోని పోరుగడ్డ జోడేఘాట్ గ్రామం ముస్తాబైంది. రాష్ట్ర గిరిజనశాఖ మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఎంపీ గోడం నగేశ్, ఆసిఫాబాద్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జు తదితర ప్రముఖులు హాజరై భీం విగ్రహానికి నివాళులర్పించనున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతోపాటు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే ప్రజల కోసం జిల్లా యంత్రాంగం, ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం గురువారం ఉదయం 8గంటలకు జెండాలు ఆవిష్కరించనున్నారు. అనంతరం 9 గంటలకు సమాధి వద్ద పూజలు చేసి, 10 గంటలకు శ్రద్ధాంజలి ఘటించనున్నారు. ఇప్పటికే కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా, ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పలుమార్లు జోడేఘాట్‌ను సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

**చకచకా ఏర్పాట్లు.. పటిష్ట బందోబస్తు**

కుమురంభీం వర్ధంతి కోసం అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇటీవల భీం విగ్రహానికి మెరుగులు దిద్దారు. టెంట్లు వేయడంతోపాటు పార్కింగ్ స్థలాలు, హెలిప్యాడ్ పనులు చేపట్టారు. భారీగా గిరిజనులు, గిరిజనేతరులు తరలివచ్చే అవకాశం ఉండటంతో తాత్కాలికంగా మూత్రశాలలు ఏర్పాటు చేస్తున్నారు. పనుల పర్యవేక్షణ కోసం గిరిజన సంక్షేమశాఖలో పనిచేస్తున్న ఏటీడబ్ల్యూవోలు ముగ్గురు, సీఆర్‌టీలు, రెగ్యులర్ టీచర్లు వందమంది, ఆశ్రమ వార్డెన్లు ఐదుగురు, సిబ్బందిని డిప్యూటేషన్‌పై నియమించారు. అలాగే ఐకేపీ సిబ్బంది 35 మంది, ఇంజినీరింగ్‌శాఖకు చెందిన పది మంది పనిచేస్తున్నారు. మంత్రి పర్యటన నేపథ్యంలో 460 మంది పోలీసులు విధులు నిర్వర్తించనున్నారు. ఇందులో ఎస్పీతోపాటు ముగ్గురు డీఎస్పీలు, సీఐలు 15 మంది, ఎస్సై 28 మంది ఉన్నారు. గురువారం ఉదయం 7 గంటల నుంచే భోజనం తయారీ పనులు ప్రారంభమవుతాయని, 20వేల మందికి భోజనం సరిపోయేలా ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు తెలిపారు. 150 మంది వంట మనుషులను నియమించారు. ఆసిఫాబాద్ డిపో నుంచి ప్రత్యేకంగా పది బస్సులు ఏర్పాటు చేశారు.

# ఎంవీకే ఓసీపీకి మరో ముందడుగు



ఎంవీకే ఓసీపీ ఓబీ కోసం ప్రతిపాదించిన మాదారం టౌన్‌షిప్ ప్రాంతం

- నాన్ కోల్ బేరింగ్ ఏరియా పరిధిలోకి వచ్చే భూముల గుర్తింపు
- నోటిఫికేషన్ జారీ చేసిన తహసీల్దార్
- అభ్యంతరాలు ఉంటే తెలపాలని పట్టాదారులకు సూచన

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఏరియాలో మూసి వేసిన బొగ్గు గనుల స్థానంలో కొత్తగా ప్రతిపాదించిన మహావీర్‌ఖని(ఎంవీకే) ఓపెన్ కాస్టు ప్రాజెక్టు (ఓసీపీ) ప్రయత్నాల్లో మరో ముందడుగు పడింది. ఆరేళ్లుగా ప్రతిపాదనలు చేసినా కార్యాచరణ లేకుండాపోయింది. తాజాగా ఓసీపీ మైనింగ్ ప్లాన్ అప్రూవల్ కోసం సింగరేణి యాజమాన్యం ఒక్కసారిగా ప్రయత్నాలు ముమ్మరం చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రతిపాదిత ఓసీపీ పరిధిలోకి వచ్చే నాన్ కోల్ బేరింగ్ ఏరియాలోని పట్టా భూముల రీసర్వేకు బుధవారం తాండూర్ తహసీల్దార్ నోటిఫికేషన్ జారీ చేశారు. మాదారం, తాండూర్, వెంకాయ్‌పల్లి గ్రామాల శివారులోని 202.13హెక్టార్ల భూమి ఓసీపీ పరిధిలోకి వస్తుందని సర్వే చేసి నిర్ధారించారు. ఇందులో 90.74 హెక్టార్లు అటవీయేతర భూమి కాగా మరో 111.39 హెక్టార్లు అటవీ భూమిగా గుర్తించారు. అటవీ భూమి ఇప్పటికే సింగరేణి ఆధీనంలో ఉండగా.. లీజు గడువును మరి కొన్నాళ్లు పొడగిస్తూ అటవీశాఖతో ఒప్పందం చేసుకుంది. నాన్ కోల్ బేరింగ్ ఏరియా పరిధిలోకి వచ్చే పట్టా భూముల సర్వే నంబర్లను బహిర్గతం చేసి ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని మండల రెవెన్యూ కార్యాలయం, పంచాయతీల్లో నోటీసు బోర్డుపై నోటిఫికేషన్ ప్రతులు అతికించారు. పట్టాదారుల నుంచి సానుకూలత వ్యక్తమయ్యేలా చర్యలు తీసుకుని ఆ తర్వాత మైనింగ్ ప్లాన్ అప్రూవల్‌కు దరఖాస్తు చేసుకోవాలనే తలంపులో సింగరేణి అధికారులు ఉన్నారు. ఓసీపీ ఏర్పాటుకు పర్యావరణ, అటవీశాఖ, కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖలతోపాటు పలు శాఖల అనుమతులు అవసరం అవుతాయి. ఆయా శాఖల నుంచి అనుమతి రావాలంటే మైనింగ్ ప్లానింగ్ అప్రూవలే కీలకం. ఈ నేపథ్యంలో సింగరేణి శరవేగంగా ప్రయత్నాలు చేస్తోంది.

**గుర్తించిన భూముల సర్వే నంబర్లు ఇవే..**

నాన్ కోల్ బేరింగ్ ఏరియా పరిధిలోకి వచ్చే పట్టాభూములను గుర్తించి సర్వే నంబర్లను వెల్లడించారు. మాదారం గ్రామ శివారులో 32/3, 33, 34/1, 38, 53, 54, 55, 56, 57, 58, 59, 60, 61, 62, 67, 79/1, 17, 45/1, 48, 49, 50 సర్వే నంబర్లు ఉండగా, తాండూర్ గ్రామ శివారులో 787, 788, 789, 790, 791, 792, 677, 678, 679, 680, 670, 810, 672, 676, 669/1, 671, 794, వెంకాయ్‌పల్లి గ్రామ శివారులో 1, 36, 2, 37, 38, 39 సర్వే నంబర్లు ఉన్నాయి. ఆయా సర్వేనంబర్లలో కనిష్టంగా ఒక గుంట నుంచి గరిష్టంగా 98 ఎకరాల వరకు భూములు ఉన్నట్లు పేర్కొన్నారు.

**నాన్ కోల్ బేరింగ్ ఏరియాలో చేపట్టే పనులు**

ఎంవీకే ఓసీపీ ఏర్పాటులో భాగంగా యాజమాన్యం నాన్ కోల్ బేరింగ్ ఏరియాలో బొగ్గు ఉత్పత్తియేతర పనులు చేపట్టాలని ప్రతిపాదించింది. ప్రధానంగా బొగ్గు ఉత్పత్తికి ఓబీ మట్టిని డంపింగ్ చేయడం, రోడ్లు, హెచ్‌టీ విద్యుత్ లైన్లు, పైప్‌లైన్ల నిర్మాణం చేయనుంది. అన్ని రకాల అదనపు అవసరాల కోసం వినియోగించనున్నట్లు పేర్కొంది.

**మాదారంపై మట్టికుప్పలు!**

బెల్లంపల్లి ఏరియాలో మాదారం టౌన్‌షిప్ కార్మిక క్షేత్రంగా ఉంది. సింగరేణి యాజమాన్యం దశాబ్దాల క్రితం 850 క్వార్టర్లు నిర్మించింది. ఈ ప్రాంతంలోని భూగర్భ గనులు మూతపడడంతో కార్మికులు ఇతర ప్రాంతాలకు వెళ్లిపోగా ప్రస్తుతం నిర్వహణ లేక 25శాతం క్వార్టర్లు శిథిలావస్థకు చేరాయి. మిగతా వాటిలో కార్మికులు, కార్మికేతరులు ఉంటున్నారు. కంపెనీ లీజు భూమిలో కార్మికేతరులు స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తుండగా, మాదారం టౌన్‌షిప్ పూర్తిగా ఫారెస్టు లీజు భూమిలో ఉంది. ఇక్కడ నివాసం ఉంటున్న ప్రజలకు ఇళ్లపట్టాలు ఇస్తారని ఆశించగా ఓసీపీ తెరమీదకు రావడంతో ఆశలు అడియాశలయ్యాయి. ప్రతిపాదిత ఓపెన్ కాస్ట్‌తో మాదారం టౌన్‌షిప్ మట్టి దిబ్బగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# వేంపల్లిలో ఎన్‌ఎల్‌ఎం బృందం పర్యటన



వేంపల్లి పంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న బృందం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): నేషనల్ లెవెల్ మానిటర్స్(ఎన్ఎల్ఎం) బృందం బుధవారం హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామాన్ని సందర్శించింది. బృందంలోని అధికారులు బాలకృష్ణ, ఏ.కే.సునీల్ జిల్లా, మండల, గ్రామ స్థాయి అధికారులతో కలిసి కేంద్రం ప్రభుత్వ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులు, పథకాల అమలు తీరును పర్యవేక్షించి క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. పంచాయతీ ఆవరణలో మహిళా స్వయం సహాయక సంఘాలతో సమావేశమై ఆర్థిక పురోగతి, రుణాల వివరాలు తెలుసుకున్నారు. ఈజీఎస్ కూలీలతో మాట్లాడి వారికి ఇంకా కావాల్సిన వసతులపై అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ కిషన్, నోడల్ అధికారి సదానంద్, ఎంపీడీఓ ప్రసాద్, ఎంపీఓ ఉమర్‌షరీఫ్, ఈజీఎస్ ఏపీఓ మల్లయ్య, ఈసీ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి ప్రతిభ తదితరులు పాల్గొన్నారు.

**ఉపాధి హామీ పథకం సద్వినియోగం చేసుకోవాలి**

జైపూర్: ఉపాధి హామీ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర బృందం అధికారులు కేహెచ్.సునీల్, సీవీ.బాలమురళి అన్నారు. బుధవారం మండలంలోని టేకుమట్ల గ్రామ పంచాయతీలో పర్యటించి ఉపాధి హామీ పథకం పనుల వివరాలు, మహిళా సంఘాలు, కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమై అభివృద్ధి పనుల వివరాలు, మహిళా సంఘాల రుణాలపై అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో శ్రీపతి బాపు, పంచాయతీ కార్యదర్శి శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

### ఈ–పాస్ మిషన్‌పై అవగాహన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల డివిజన్ పరిధిలోని ఫర్టిలైజర్ డీలర్లకు బుధవారం హాజీపూర్ మండలం గుడిపేట రైతువేదికలో ఈ–పాస్ మిషన్‌పై జిల్లా వ్యవసాయ శాఖ, ఫాక్ట్ ఫర్టిలైజర్ కంపెనీ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఎరువు బస్తాలతోపాటు బయోమెట్రిక్ వివరాల నమోదు, రైతుల ఆధార్ నంబర్ సేకరణ, అమ్మకాల విధానంపై వివరించారు. కేంద్ర ప్రభుత్వ ఎంఎఫ్ఎంఎస్ పోర్టల్‌లో వివరాలు నమోదు అంశాలపై తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారులు కృష్ణ, మహేందర్, అంజిత్, శ్రీకాంత్, ఫాక్ట్ ఫర్టిలైజర్ కంపెనీ ప్రతినిధులు, డీలర్లు పాల్గొన్నారు.

### మార్కెట్‌లో ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను తొలగిస్తున్న జేసీబీ

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని మార్కెట్ ఏరియాలో రోడ్డును ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను మున్సిపల్ అధికారులు బుధవారం తొలగించారు. గతంలోనే తొలగింపు కార్యక్రమాన్ని ప్రారంభించినా.. దసరా పండుగల నేపథ్యంలో వ్యాపారుల వినతి మేరకు ఈ నెల 15వరకు గడువు ఇచ్చారు. గడువు తీరడంతో ఆక్రమణల తొలగింపును బుధవారం మరోసారి చేపట్టారు. జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల గోడను ఆనుకుని వేసిన టేలాలను తొలగించగా.. మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్, టీపీవో సంపత్, టీపీఎస్ శ్యాం పరిశీలించారు.

# ‘పది’లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి



ఆర్‌జేడీకి స్వాగతం పలుకుతున్న హెచ్‌ఎం సిబ్బంది

జన్నారం: వచ్చే పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని వరంగల్ రీజినల్ జాయింట్ డైరెక్టర్(ఆర్‌జేడీ) సత్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం నిర్మల్ నుంచి తిరిగి వెళుతూ మండలంలోని కలమడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ప్రధానోపాధ్యాయుడు కట్ట రాజమౌళి, ఉపాధ్యాయులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యం ఎంచుకుని ప్రణాళికబద్ధంగా చదవాలని సూచించారు. ఇటీవల డీఎస్సీ ద్వారా నియామకమైన ఉపాధ్యాయులతో అన్ని పాఠశాలల్లో కొరత తీరినట్లేనని, ఇక అందరూ బోధనపై దృష్టి సారించాలని తెలిపారు. కలమడుగు పాఠశాల ఉపకారవేతనాల ఎంపికలో గత సంవత్సరం జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలువడం, పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక బోధన చేయడంపై ఉపాధ్యాయులను అభినందించారు. ఎంఈవో విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఆరుగురు సీఐల ఆకస్మిక బదిలీ

మంచిర్యాలక్రైం: కాళేశ్వరం మల్టీజోన్–1 పరిధిలో పని చేస్తున్న ఆరుగురు సీఐలను ఆకస్మికంగా బదిలీ చేస్తూ మల్టీ జోన్–1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బదిలీల వ్యవహారం పోలీస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

| పేరు | ప్రస్తుత స్థానం | బదిలీ స్థానం |
| --- | --- | --- |
| ఎస్.ప్రమోద్‌రావు | ఐటీ సెల్ రామగుండం | ఎస్‌హెచ్‌వో మంచిర్యాల |
| ఆర్.భన్సీలాల్ | మంచిర్యాల సీఐ | ఐజీపీ మల్టీజోన్–1 హైదరాబాద్ |
| డీ.వేణుచందర్ | సీసీఎస్ రాజన్న సిరిసిల్ల | శ్రీరాంపూర్ సీఐ |
| దబ్బెట మోహన్ | శ్రీరాంపూర్ సీఐ | ఐజీపీ మల్టీజోన్–1 హైదరాబాద్ |
| బండారి సంపత్ | ఐజీపీ మల్టీజోన్–1 హైదరాబాద్ | డీసీఆర్‌బీ కుమురంభీం |
| బోర్కార్ రవీందర్ | ఐజీపీ మల్టీజోన్–1 హైదరాబాద్ | సీసీఎస్ సిద్దిపేట |

# పోరు పల్లెలు.. తీరని వెతలు

- అభివృద్ధికి దూరంగా 12 పోరు గ్రామాలు
- ఏళ్లుగా అధ్వానంగా రహదారులు
- తాగు, సాగునీటికి ఇబ్బందులు
- పక్కా గృహాలు అందక.. గుడిసెల్లో నివాసం
- ప్రభుత్వాలు మారుతున్నా.. మెరుగపడని వసతులు



పాటగూడ గ్రామానికి వెళ్లే దారి దుస్థితి

**కెరమెరి(ఆసిఫాబాద్):** ఆదివాసీల హక్కుల కోసం నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన గోండు బెబ్బులి కుమురంభీం వర్ధంతి గురువారం కెరమెరి మండలం జోడేఘాట్‌లో నిర్వహించనున్నారు. కెరమెరి మండలంలోని జోడేఘాట్, జోడేఘాట్ కొలాంగూడ, టోకెన్‌మోవాడ్, బాబేఝరి కొలాంగూడ, బాబేఝరి గోండ్‌గూడ, బాబేఝరి మహరాజ్‌గూడ, శివగూడ, చిన్నపట్నాపూర్, పెద్ద పట్నాపూర్, పాటగూడ, లైన్‌పటార్, పిట్టగూడ గ్రామాలను ఏకం చేసి భీం పోరు సాగించారు. ఈ గ్రామాలను పోరు పల్లెలుగా పిలుస్తారు. అయితే ప్రత్యేక రాష్ట్రంలోనూ ఇక్కడ పరిస్థితులు మార లేదు.. సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. ప్రభుత్వాలు మారుతున్నా గిరిజన ప్రజల జీవితాల్లో మార్పు కనిపించడం లేదు. కనీసం శుద్ధ జలం, మెరుగైన వైద్యం అందని పరిస్థితులున్నాయి. నేడు కుమురంభీం వర్ధంతి సందర్భంగా పోరుగ్రామాల స్థితిగతులపై కథనం.

**ఏళ్లుగా అవే సమస్యలు**

కెరమెరి మండలం హట్టి నుంచి జోడేఘాట్ వరకు 21 కిలోమీటర్ల మేర పచ్చదనం పరుచుకుని ఉంటుంది. అయితే అక్కడ పోరు గ్రామాల్లో మాత్రం కనీస సౌకర్యాలు కరువయ్యాయి. కొందరికి రాష్ట్ర ప్రభుత్వం పోడు పట్టాలు అందించింది. అయితే సాగునీరు, భూములకు పట్టాలు, రుణాలు అందక.. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు తదితర సౌకర్యాలు లేక కష్టాలతో జీవనం సాగిస్తున్నారు. శుద్ధమైన మిషన్ భగీరథ నీరందక చాలామంది ఇప్పటికీ బావులు, చెలిమెల నీరు తాగుతున్నారు.

- జోడేఘాట్‌లో 50 ఇళ్లు ఉండగా 270 మంది నివాసం ఉంటున్నారు. నాలుగు చేతిపంపుల్లో ఒకటే పనిచేస్తోంది. గిరిజన ఆశ్రమ పాఠశాలఉంది.



అధ్వానంగా శివగూడకు వెళ్లే దారి

శివగూడ గ్రామస్తులు తాగునీటికి వినియోగిస్తున్న చెలిమె

ఐదేళ్ల క్రితం ఐటీడీఏ ఆధ్వర్యంలో బిగించిన సోలార్ నిరుపయోగంగా మారింది. 30 డబుల్ బెడ్రూం ఇళ్లలో మూడు మాత్రమే పూర్తయ్యాయి.

- జోడేఘాట్ కొలాంగూడలో 20 కుటుంబాలు, 175 జనాభా ఉంది. స్థానికంగా పాఠశాల లేక విద్యార్థులు జోడేఘాట్‌కు వెళ్తుంటారు. అంగన్‌వాడీ కేంద్రం లేదు.
- టోకెన్‌మోవాడ్‌లో 20 కుటుంబాలు, 96 మంది నివాసం ఉంటున్నారు. కొందరికి ఇప్పటికీ పట్టాలు లేక బ్యాంకు రుణాలు అందడం లేదు. డబుల్ బెడ్రూం ఇళ్లు అందక పెంకుటిళ్లలో జీవనం వెల్లదీస్తున్నారు.
- బాబేఝరి కొలాంగూడలో 23 కుటుంబాలు, 170 జనాభా ఉంది. భగీరథ నీరు రాకుంటే కిలోమీటర్ దూరంలోని బావి నుంచి నీటిని తెచ్చుకుంటారు. ఎడ్లజతలు మంజూరు చేయాలని రైతులు ఐటీడీఏ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.
- బాబేఝరి గోండ్‌గూడలో 23 కుటుంబాల్లో 132 మంది ఉన్నారు. ఆరుగురి భూములకు పట్టాలు అందలేదు. భారీ వర్షం కురిస్తే గుట్ట పైనుంచి ఇళ్లలోకి వరద చేరుతుంది. ఇక్కడ పది కుటుంబాలకు పక్కా ఇళ్లు లేవు.
- బాబేఝరి మహరాజ్‌గూడలో 35 కుటుంబాల్లో 173 మంది ఉన్నారు. కొందరికి రేషన్ కార్డులు, పోడు పట్టాలు లేవు. స్థానికులు ఎక్కువగా బావి నీటినే తాగుతున్నారు.
- శివగూడ 15 కుటుంబా లు ఉండగా.. 70 మంది నివాసం ఉంటున్నారు. అంగన్‌వాడీ కేంద్ర, ప్రాథమిక పాఠశాల లేక చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. చెలిమె నీటిని తాగుతున్నామని స్థానికులు చెబుతున్నారు. ఐటీడీఏ అధికారులు ఇక్కడ 13 మోడల్ గృహాలు నిర్మించారు. మరో మూడు కుటుంబాలకు ఇళ్లు అందాల్సి ఉంది.
- చిన్నపట్నాపూర్ 48 కుటుంబాలు, జనాభా 228 ఉంది. నూతనంగా ఇళ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.
- పెద్దపట్నాపూర్‌లో 27 కుటుంబాల్లో 183 మంది ఉన్నారు. ఇక్కడ కూడా అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల లేదు.
- పాటగూడలో 43 కుటుంబాలు ఉండగా.. 220 మంది జీవనం సాగిస్తున్నారు. కానుగ మొక్కల పెంపకంతో ఈ గ్రామం పేరు సంపాదించింది. 20 మంది విద్యార్థులున్నా పాఠశాల లేదు. రైతులకు పట్టాలు లేక రుణాలు పొందలేకపోతున్నారు.
- లైన్‌పటార్‌లో 11 కుటుంబాల్లో 48 మంది ఉన్నారు. పాఠశాల లేదు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. టోకెన్‌మోవాడ్ నుంచి సరైన రోడ్డు సౌకర్యం లేదు.
- పిట్టగూడలో 11 కుటుంబాల్లో 50 మంది ఉన్నారు. ఉపాధ్యాయుడు లేక పాఠశాల తెరుచుకోవడం లేదు. పక్కా ఇళ్లు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### పక్కా ఇళ్లు నిర్మించాలి



సుమారు 50 ఏళ్లుగా ఇక్కడే నివాసం ఉంటున్నాం. ప్రభుత్వం నుంచి ఇళ్లు మంజూరు కాలేదు. అధికారులు, ప్రజాప్రతినిధుల అలసత్వంతో నేటికీ పూరి గుడిసెల్లోనే ఉంటున్నాం. రాష్ట్ర ప్రభుత్వం పక్కా ఇళ్లు నిర్మించాలి.

– ఆత్రం పావుగా, పాటగూడ, మం:కెరమెరి

### అధ్వానంగా రోడ్డు



టోకెన్‌మోవాడ్ నుంచి లైన్‌పటార్ వరకు రోడ్డు అధ్వానంగా ఉంది. అటవీ శాఖ నుంచి అనుమతులు మంజూరు చేసి బీటీ రోడ్డు నిర్మించాలి. ఇందుకు ఐటీడీఏ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

– ఆత్రం భీంరావు, లైన్‌పటార్, మం:కెరమెరి

## గోండు బెబ్బులి.. భీం

- నేడు జోడేఘాట్‌లో 84వ వర్ధంతి



జోడేఘాట్‌లోని కుమురంభీం విగ్రహం

**ఆసిఫాబాద్:** గోండు బెబ్బులి, ఆదివాసీల ఆరాధ్య దైవం కుమురంభీం.. ఆసిఫాబాద్ మండలం రౌటసంకెపల్లిలో కుమురం చిన్ను, సోంబాయి దంపతులకు 1901లో జన్మించిన ఆయన నిజాం ప్రభుత్వ దోపిడీ, దౌర్జన్యాలను వ్యతిరేకిస్తూ వీరోచితంగా పోరాడారు. అడవిపై ఆదివాసీలకు హక్కులు కల్పించాలని జల్, జంగల్, జమీన్ నినాదంతో ఉద్యమం చేపట్టారు. నేడు భీం వర్ధంతి నేపథ్యంలో ఆయన పోరాటంపై కథనం.

**అకృత్యాలను చూడలేక..**

గిరిజన ప్రాంతాల్లో పెత్తందార్లు, అటవీశాఖ అధికారుల అకృత్యాలను కుమురంభీం కళ్లారా చూశారు. మేకల మేత కోసం చెట్టుకొమ్మ కొట్టిన తన స్నేహితుడు పైకు చేతివేళ్లను జంగ్లాత్ సేరేదార్ నరికించడాన్ని చూసి భీం కన్నీరు మున్నీరయ్యారు. తండ్రి చిన్ను విషజ్వరంతో మృతి చెందడంతో సోదరులు సోము, బొజ్జుతో కలిసి రౌటసంకెపల్లిని వీడి కెరమెరి మండలం సుర్దాపూర్‌కు చేరుకున్నారు. అక్కడ ఆదివాసీలు నెలల తరబడి అడవిని నరికి సేద్యం చేయగా, పంట చేతికొచ్చే సమయానికి సిద్దిక్ అనే జాగిర్దార్ భూముల స్వాధీనం చేసుకునేందుకు యత్నించాడు. సిద్దిక్‌పై దాడి చేయడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. భీం అక్కడి నుంచి పారిపోయి బల్లార్షా మీదుగా మహారాష్ట్రలోని చాందా చేరుకున్నారు. అక్కడ కొంతకాలం పనిచేసి అస్సాం వెళ్లిపోయారు. కాఫీ, తేయాకు తోటల్లో పనిచేస్తూ ఐదేళ్లు గడిపారు.

**దట్టమైన అడవుల్లో పోరాటం**

అస్సాం నుంచి తిరిగి వచ్చిన కుమురంభీం కెరమెరి మండలం జోడేఘాట్ కేంద్రంగా నిజాం సర్కార్‌పై గెరిల్లా పోరాటం చేశారు. ఆయనకు సూరు, వెడ్మరాము సహచరులుగా ఉన్నారు. యువకులకు శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వానికి పన్నులు చెల్లించవద్దని గ్రామాల్లోని ప్రజలను చైతన్యపరిచారు. అప్పుల పేరుతో పంట దోచుకునేందుకు వచ్చే వ్యాపారులు, పన్ను వసూళ్లకు వచ్చే రెవెన్యూ అధికారులపై దాడులు కొనసాగించారు. బాబేఝరి కేంద్రంగా గిరిజనులు అడవి నరికి 12 పోరు గ్రామాలను ఏర్పాటు చేశారు. నిజాం సర్కారు వారిపై కేసు పెట్టింది. కేసుల నుంచి విముక్తి కోసం హైదరాబాద్ వెళ్లిన భీంకు నవాబు కలిసే అవకాశం దొరకలేదు. ఆయన తిరిగి వచ్చేసరికి జంగ్లాత్, తదితరులు 12 గ్రామాలపై విరుచుకుపడి తగులబెట్టారు. కలత చెందిన భీం జల్, జంగల్, జమీన్ సాధించాలంటే ఇంటికో పోరాటయోధుడు కావాలని పిలుపునిచ్చారు. గిరిజన యువకులతో సాయుధ దళం ఏర్పాటు చేశారు.

నిజాం ప్రభుత్వం చర్చలకు సబ్‌కలెక్టర్‌ను జోడేఘాట్‌కు పంపించింది. 12 గ్రామాలకు పట్టాలిస్తామని అప్పులన్నీ మాఫీ చేస్తామని ప్రతిపాదించాడు. కానీ భీం 12 పోరుగ్రామాల మీద రాజ్యాధికారం కావాలని డిమాండ్ చేయడంతో చర్చలు విఫలమయ్యాయి.

**అనుచరుడి వెన్నుపోటుతో మరణం..**

విషయం నిజాం రాజుకు తెలియడంతో ఆగ్రహానికి గురై భీంను అంతమొందించాలని ఆదేశించాడు. 1940లో దాదాపు ఏడునెలల పాటు భీం అనుచరులు, నిజాం ప్రభుత్వ సేనల మధ్య యుద్ధం సాగింది. భీం అనుచరుడు మడావి కొద్దు ఇచ్చిన సమాచారంతో అక్టోబర్ 10న భీకరపోరులో కుమురంభీం నేలకొరిగారు. నాలుగు దశాబ్దాలుగా ఏటా జోడేఘాట్‌లో భీం వర్ధంతి నిర్వహిస్తున్నారు. గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం ఐటీడీఏ ఆధ్వర్యంలో దర్బార్ ఏర్పాటు చేస్తున్నారు.

## క్లుప్తంగా

### దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

**మంచిర్యాలటౌన్:** మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కార్యాలయంలో దివ్యాంగులకు ఉపకరణాలను జిల్లా సంక్షేమ శాఖ అధికారి జి.స్వరూప రాణి పంపిణీ చేశారు. 4జీ స్మార్ట్‌ఫోన్లు 9, హియరింగ్ హెడ్స్ నాలుగు దివ్యాంగులకు అందజేశారు. ఎఫ్‌ఆర్‌వో ఫర్జానా బేగం, సీనియర్ అసిస్టెంట్ మల్లేశ్ పాల్గొన్నారు.

### మూగ మగ వ్యక్తిపై లైంగిక దాడి

**ఇచ్చోడ:** మండలంలోని నవేగావ్‌లో నాలుగు రోజుల క్రితం 32ఏళ్ల మూగ మగ వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన 22 ఏళ్ల మగ వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆదివారం దుర్గాదేవి నిమజ్జనం సందర్భంగా రాత్రి ఎనిమిది గంటల సమయంలో ఈ దాడికి పాల్పడినట్లు తెలిసింది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

### గంజాయి పట్టివేత

**ఆదిలాబాద్‌టౌన్:** పట్టణంలోని మహాలక్ష్మి వాడకు చెందిన ఇద్దరు యువకులు గంజాయి విక్రయించేందుకు సిద్ధం కాగా పోలీసులు పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. బుధవారం మార్కెట్ యార్డు సమీపంలో మహాలక్ష్మివాడకు చెందిన రిజ్వాన్ ఖాన్, సాయితేజ కిలో 20గ్రాముల గంజాయిని విక్రయించేందుకు యత్నించారు. వీరు మహారాష్ట్రలోని యావత్మాల్‌కు చెందిన సయ్యద్ అలీ నుంచి కొనుగోలు చేసి ఇక్కడ విక్రయిస్తున్నట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు.

## పాముకాటుకు ఆశా కార్యకర్త మృతి



ఆశ వర్కర్ కుంర దుర్పతబాయి(ఫైల్)

**ఇంద్రవెల్లి:** పాముకాటుతో ఆశా కార్యకర్త మృతి చెందిన ఘటన మండలంలోని కొబ్బయ్‌గూడ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన కొలాం గిరిజన మహిళ కుమ్ర దుర్పతబాయి(33) ఆశా కార్యకర్తగా విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి పడుకున్నారు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఇంట్లోకి చొరబడిన పాము ఆమె నిద్రలో ఉండగా కాటు వేసింది. కొద్దిసేపటికి ఆమె వాంతులు చేసుకొని స్పృహ కోల్పోయింది. కుటుంబ సభ్యులు ఆమె శరీరాన్ని పరిశీలించగా పాము కాటు గుర్తులను కనిపించాయి. వెంటనే 108లో రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందింది. మృతురాలికి భర్త సోనేరావ్‌తో పాటు కూతుళ్లు శ్రీదేవి, అఖిల, కుమారుడు సందీప్ సంతానం. తల్లిని కోల్పోయిన చిన్నారులు రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది.

## రోడ్డుప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి



నాఫెఖాన్ (ఫైల్)

**ఖానాపూర్:** మండలంలోని ఎక్బాల్‌పూర్ గ్రామంలో ఈనెల 14న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ రిటైర్డ్ ఉపాధ్యాయుడు నాఫెఖాన్ (58) బుధవారం మృతి చెందాడు. ఖానాపూర్ నివాసి నాఫెఖాన్ నిర్మల్‌లో స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నాడు. తన ద్విచక్రవాహనంపై ఖానాపూర్‌కు పని నిమిత్తం వచ్చి నిర్మల్ వెళ్తుండగా ఎక్బాల్‌పూర్ గ్రామంలో డివైడర్‌ను ఢీకొట్టి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే క్షతగాత్రుడిని నిర్మల్‌కు అక్కడి నుంచి హైదరాబాద్ ఆసుపత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

## అత్యాచారం కేసులో ఒకరికి 20ఏళ్ల జైలు

- రూ.7వేల జరిమానా

**ఆదిలాబాద్‌టౌన్:** బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి 20ఏళ్ల జైలు శిక్షతోపాటు రూ.7వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు జడ్జి పి.శివరాంప్రసాద్ తీర్పునిచ్చారు. లైజన్ అధికారి పండరి తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన జమీల్‌ఖాన్ అరబిక్ భాష నేర్పే క్రమంలో పిల్లల ఇంటికి వెళ్లి పాఠాలు చెప్పేవాడు. అందులో భాగంగా 2021 ఫిబ్రవరి 14న ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఇంటికి వెళ్లిన ఆ బాలిక విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై రామకృష్ణ కేసు నమోదు చేయగా, డీఎస్పీ వెంకటేశ్వర్లు దర్యాప్తు చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. పీపీ రమణారెడ్డి 14 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువైందని తెలిపారు. ఈ మేరకు జడ్జి తీర్పు నిచ్చినట్లు వివరించారు.

### ఆటో తగులబెట్టిన యువకుల రిమాండ్

**ఆదిలాబాద్‌టౌన్:** పట్టణంలోని మహాలక్ష్మివాడకు చెందిన జాదవ్‌పండిత్ ఆటోను తగులబెట్టిన ముగ్గురు యువకులను టూటౌన్ పోలీసులు బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. భుక్తాపూర్‌కు చెందిన దగడ్ సాయి, శ్రీరాం కాలనీకి చెందిన దస్‌గట్ సుధీర్, ఇందిరమ్మ కాలనీకి చెందిన మసాల అజయ్ మంగళవారం తెల్లవారుజామున ఆటోను తగులబెట్టారు. పండిత్ జాదవ్‌కు కిరాణ షాపు ఉండగా రాత్రి కావడంతో మూసివేశాడు. సిగరేట్, గుట్కాలు ఇవ్వలేదనే కోపంతో వారు ఆటోను తగలబెట్టినట్లు ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు.

### విద్యుదాఘాతంతో లైన్‌మెన్‌కు గాయాలు

**భైంసాటౌన్:** పట్టణంలో విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు ఓ లైన్‌మెన్ తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికుల కథనం ప్రకారం.. నర్సాపూర్(జి) మండలం తురాటి గ్రామానికి చెందిన పులి జైపాల్ భైంసా పట్టణ సబ్ స్టేషన్‌లో ఏఎల్‌ఎంగా పనిచేస్తున్నాడు. బుధవారం మహాగాం రోడ్డులో డబుల్ బెడ్రూం గృహ సముదాయం సమీపంలో విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా తీగలు తగిలి తీవ్ర గాయాలపాలయ్యాడు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. డీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏడీఈ ఆదిత్య పరామర్శించారు.

## మైక్రో ఏటీఎంతో చేతివాటం

- సీఎస్పీ నిర్వాహకుడి తమ్ముడి మాయాజాలం
- టీజీబీలో ఖాతాదారుల నుంచి రూ.6లక్షలు స్వాహా
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన



బ్యాంక్ మేనేజర్‌ను అడుగుతున్న ఖాతాదారులు

**కోటపల్లి:** నిరుపేద, నిరక్షరాస్యుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని ఓ వ్యక్తి తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఖాతాదారుల సొమ్మును కాజేశాడు. ఖాతాల నుంచి నగదు విత్‌డ్రా కోసం వచ్చిన వారిని మోసం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నక్కలపల్లి గ్రామానికి చెందిన పుప్పిరెడ్డి మహేశ్‌రెడ్డి గ్రామంలోనే సీఎస్పీ నిర్వహిస్తున్నాడు. సీఎస్పీలోని మైక్రో ఏటీఎంను అతడి తమ్ముడు సాయిరెడ్డి తీసుకెళ్లి కోటపల్లిలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆవరణలో కూర్చునేవాడు. నిరక్షరాస్యులు నగదు విత్‌డ్రా ఓచర్ రాసివ్వమని అడిగితే ఇదే అదునుగా భావించి వారి ఖాతాల్లో ఎంత సొమ్ము ఉందో తన వద్ద ఉన్న మైక్రో ఏటీఎం ద్వారా పరిశీలించేవాడు. వారి ఖాతాల్లోని సొమ్మును తన ఖాతాలోకి మళ్లించుకునేవాడు. తీరా ఖాతాదారులు ఇంటికి వెళ్లి ఇరుగుపొరుగు వారి వద్ద పరిశీలించుకుని మోసపోయామని గ్రహించారు. బ్యాంకుకు వెళ్లి ఆరా తీయగా సాయిరెడ్డి ఖాతాలోకి నగదు మళ్లినట్లు బ్యాంకు అధికారులు గుర్తించారు. కొండంపేట, నాగంపేట, నక్కలపల్లి, మల్లంపేట గ్రామాలకు చెందిన ఖాతాదారుల నుంచి సుమారు రూ.6లక్షల వరకు స్వాహా చేసినట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఇవి అధికారికంగా సాయిరెడ్డి బ్యాంక్ నుంచి ట్రాన్స్‌ఫర్ చేసుకున్నవి కాగా మైక్రో ఏటీఎంతో ఇంకా ఎంత నగదు తస్కరించాడో విచారణ చేపట్టాలని బాధితులు డిమాండ్ చేశారు. సాయిరెడ్డి తన ఖాతా నుంచి రూ.59వేలు తనకు తెలియకుండా ట్రాన్స్‌ఫర్ చేసుకున్నాడని కొండంపేట గ్రామానికి చెందిన గావిడి భీమయ్య బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై బ్యాంక్ మేనేజర్ రాజేశ్‌ను సంప్రదించగా.. సాయిరెడ్డి నిరక్షరాస్యుల నుంచి నగదు ట్రాన్స్‌ఫర్ చేసుకున్నది నిజమేనని, ఫిర్యాదు మాత్రం ఒక్కరే ఇచ్చారని, విచారణ జరిపి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### చికిత్స పొందుతూ ఒకరి మృతి

**ఆదిలాబాద్‌టౌన్:** మహారాష్ట్రలోని కిన్వట్ తాలుకా కోప్రా గ్రామానికి చెందిన ముండే జ్యోత్స్న(36) రిమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందింది. కడుపునొప్పితో ఏడాదిగా బాధపడుతున్న ఈమె మంగళవారం ఉదయం పంట చేలో పురుగుల మందు తాగింది. కుటుంబీకులు వెంటనే జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్సై నజీబ్ తెలిపారు.


### ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య



అరవింద్ (ఫైల్)

**కుంటాల:** కుంటాల పంచాయతీ పరిధి సేవాలాల్ తండాకు చెందిన చవాన్ అరవింద్ (28) బుధవారం వేకువజామున ఇంట్లో దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై దేవ్‌రావు కథనం ప్రకారం చవాన్ అరవింద్ కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం రాత్రి ఇంట్లో నిద్రించాడు. ఉదయం కుటుంబ సభ్యులు లేచి చూసేసరికి దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కొన్ని రోజులుగా మద్యానికి బానిసైన అరవింద్ జీవితంపై విరక్తి చెంది అఘాయిత్యానికి పాల్పడినట్లు ఏఎస్సై పేర్కొన్నారు. మృతుడి తండ్రి మారుతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

### మద్యంమత్తులో యువకుడు..



మహేశ్(ఫైల్)

**బెల్లంపల్లిరూరల్:** మద్యం మత్తులో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని బుచ్చయ్యపల్లి గ్రామ పంచాయతీ పరిధి పెద్ద దుబ్బలో చోటు చేసుకుంది. తాళ్లగురిజాల ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్ద దుబ్బకు చెందిన మంచాల మహేశ్(24) మెకానిక్ పని చేస్తున్నాడు. దసరా పండుగ నుంచి అతిగా మద్యం సేవిస్తున్నాడు. సోమవారం సాయంత్రం అతిగా మద్యం సేవించి కింద పడిపోగా స్నేహితులు ఇంటి వద్ద దించి వెళ్లారు. అతిగా మద్యం సేవిస్తున్నందున తల్లిదండ్రులు మందలిస్తారని భయపడి ఇంట్లోని బాత్రూంలో పురుగుల మందు తాగాడు. కుటుంబీకులు మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆరోగ్యం క్షీణించి మంగళవారం రాత్రి మహేశ్ మృతిచెందాడు. మృతుడి తండ్రి రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## హత్య కేసులో 16 మందికి జీవితఖైదు

**రెబ్బెన(ఆసిఫాబాద్):** రెబ్బెన మండలం సింగల్‌గూడకు చెందిన అజ్మీర రమేశ్ హత్య కేసులో 16 మంది నిందితులకు జీవిత ఖైదుతోపాటు రూ.1,49,000 జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ బుధవారం తీర్పు వెలువరించారు. ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. సింగల్‌గూడకు చెందిన అజ్మీర రమేశ్ సోదరి రాజేశ్వరి ఇంటికి వెళ్తుండగా.. అదే గ్రామానికి చెందిన జర్పుల సురేశ్ అడ్డగించి అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాధితురాలు కేకలు వేయడంతో రమేశ్, అతడి కుమారుడు లోకేశ్ ఇంటి నుంచి బయట వచ్చారు. వారిని చూసి సురేశ్ పారిపోయాడు. ఆ తర్వాత బయటకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్న అజ్మీర రమేశ్‌పై జర్పుల సురేశ్‌తోపాటు మరో 15 మంది దాడి చేసి గొడ్డలితో తలపై నరికారు. రాజేశ్వరితోపాటు రమేశ్ భార్య రేణుకను సైతం గాయపర్చారు. తీవ్రంగా గాయపడిన రమేశ్ మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడి భార్య రేణుక ఫిర్యాదుతో అప్పటి ఇన్వెస్టిగేషన్ అధికారి రమేశ్ కేసు నమోదు చేశారు. జర్పుల సురేశ్, జర్పుల సత్యవతి, అజ్మీర వసంత్‌రావు, జర్పుల తిక్యానాయక్, జర్పుల హరీశ్, అజ్మీర అరవింద్, అజ్మీర నవీన్, అజ్మీర ప్రవీణ్, అజ్మీర సంతోష్, అజ్మీర ప్రవీణ్‌కుమార్, జర్పుల లక్ష్మి, జర్పుల రజిత, జర్పుల తుకారాం, జర్పుల రవి, జర్పుల రాజు, జర్పుల బిక్యానాయక్‌ను రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఆసిఫాబాద్ కోర్టు లైజనింగ్ అధికారి రామ్‌సింగ్ ఆధ్వర్యంలో కానిస్టేబుల్ ఉమేశ్వర్ 16 మంది నిందితులను కోర్టులో ప్రవేశపెట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జగన్‌మోహన్‌రావు సాక్ష్యులను విచారించగా నేరం రుజువైంది. ప్రధాన న్యాయమూర్తి రమేశ్ నిందితులకు జీవితఖైదు జైలుశిక్ష, రూ.1,49,000 జరిమానా విధించినట్లు ఎస్పీ తెలిపారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జగన్‌మోహన్‌రావు, డీఎస్పీ కరుణాకర్, రెబ్బెన సీఐ చిట్టిబాబు, ఎస్సై చంద్రశేఖర్, కోర్టు లైజనింగ్ అధికారి రాంసింగ్, కానిస్టేబుల్ ఉమేశ్వర్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

### పోలీసుల అత్యుత్సాహం సరికాదు



మాట్లాడుతున్న జాన్సన్‌నాయక్

**ఖానాపూర్:** బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఉట్నూర్‌లో అక్రమంగా కేసు నమోదు చేయడంలో పోలీసుల అత్యుత్సాహం సరికాదని బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్య జాన్సన్‌నాయక్ అన్నారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేటీఆర్‌పై కాంగ్రెస్ నేతల ఫిర్యాదుతో కేసులు పెట్టడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నాయకులు రాజగంగన్న, వాల్‌సింగ్, సుమన్, ప్రదీప్, సుమిత్, సంతోష్, శ్రావణ్, నరేందర్, బుచ్చాగౌడ్, రమేశ్ ఉన్నారు.

### పరీక్షల్లో ప్రతిభ కనబర్చాలి



పరీక్ష తీరును పరిశీలిస్తున్న ఎస్పీ గౌస్ ఆలం

**ఆదిలాబాద్‌టౌన్:** పోలీసు శిక్షణలో ఉన్న కానిస్టేబుళ్లు పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చాలని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు శిక్షణకేంద్రంలో శిక్షణ పొందుతున్న కానిస్టేబుళ్లకు బుధవారం నిర్వహించిన రెండో సెమిస్టర్ చివరి పరీక్షను పరిశీలించారు. తొమ్మిది నెలలుగా శిక్షణ పొందుతున్న 254 మంది పరీక్ష రాసినట్లు ఎస్పీ తెలిపారు. ఆయన వెంట శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ సమయ్‌జాన్‌రావు, నిజామాబాద్ సీటీసీ ఏసీపీ సయ్యద్ మస్తాన్ అలీ, ఆర్‌ఐ కార్తీక్, ఆర్‌ఎస్సై రాకేశ్ ఉన్నారు.

### హత్య కేసులో ముగ్గురు రిమాండ్

**భీమిని:** కన్నెపల్లి మండలం షాలిగాంలో గోమాస నరేందర్ హత్య కేసులో ముగ్గురిని పోలీసులు బుధవారం రిమాండ్ చేశారు. మంగళవారం షాలిగాం గ్రామంలో నరేందర్ హత్య ఘటనలో పోలీసులు విచారణ చేపట్టారు. నరేందర్ మామ గోలేటి శంకర్, అత్త గోలేటి లక్ష్మి, భార్య భవాని అలియాస్ బేబిలను బెల్లంపల్లి కోర్టులో హాజరుపర్చగా.. న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. దీంతో నిందితులను జైలుకు తరలించినట్లు తాండూర్ సీఐ కుమారస్వామి తెలిపారు. ఈ కేసులో ఇంకా ఎవరికైనా సంబంధం ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

**ఒంటరైన కుమారుడు**

కన్న తండ్రి కాటికి, కన్న తల్లి, తాతయ్య, అమ్మమ్మలు జైలుకు వెళ్లడంతో బేబి కుమారుడు ఒటరయ్యాడు. పాలు తాగే పాప(13 నెలల) తల్లి వెంటే వెళ్లడంతో కుమారుడు(4) బంధువుల ఇంట్లో ఉన్నాడు. అమ్మ, నాన్న ఎక్కడున్నారో, ఏం జరుగుతుందో తెలియని స్థితిలో ఉన్నాడు.